సాక్షి
నంద్యాల
సోమవారం, 16, జూన్, 2025



మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళా వేదికపై ఆదివారం గుంటూరుకు చెందిన రుద్రా కళాక్షేత్రం వారి కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



చిన్న కుటుంబానికి జై..

చిన్న కుటుంబం...చింతలేని కుటుంబమని ఆధునిక జంటలు భావిస్తున్నాయి. అధిక శాతం ఇద్దరు పిల్లలతో, మరి కొందరైతే ఒకరే చాలని సరిపెట్టేసుకుంటున్నారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,604.36
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 27.625
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 8,776
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 178

న్యూస్‌రీల్

శ్రీశైలంలో భక్తుల సందడి



మల్లన్న దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు మల్లన్న దర్శనానికి భారీగా తరలివచ్చారు. వేకువజాము నుంచే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మల్లికార్జునస్వామివారి దర్శనానికి క్యూలైన్ వద్దకు చేరుకున్నారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. మూడు విడతలుగా పలువురు భక్తులు టికెట్లు పొంది స్పర్శ దర్శనం చేసుకున్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

నంద్యాల(న్యూటౌన్): స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1100ను సంప్రదించి తెలుసుకోవచ్చన్నారు. అలాగే అర్జీదారులు దరఖాస్తుల ప్రస్తుత సమాచారాన్ని meekosam.ap.gov. in వెబ్‌సైట్‌లో తెలుసుకోవడంతో పాటు తమ అర్జీలను కూడా నమోదు చేసుకోవచ్చన్నారు. అర్జీదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

శ్రీశైలం డ్యామ్‌కు పెరుగుతున్న వరద

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయానికి వరదప్రవాహం పెరుగుతుంది. కృష్ణానది పరీవాహకంలో కురుస్తున్న వర్షాల వలన జూరాల, సుంకేసుల నుంచి శ్రీశైలంకు వరదనీరు వచ్చి చేరుతుంది. ఆదివారం సాయంత్రానికి ఎగువ ప్రాజెక్ట్‌ల నుంచి 41,944 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుంది. ప్రస్తుతం జలాశయంలో 62.4320 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, డ్యాం నీటిమట్టం 840.40 అడుగులకు చేరుకుంది. శనివారం నుంచి ఆదివారం వరకు జలాశయానికి 34,819 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. విద్యుత్ ఉత్పాదన అనంతరం నాగార్జునసాగర్‌కు 6,647 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కుడిగట్టు కేంద్రంలో 0.544 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 2.588 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు.

కోసిగిలో చిరుత పులి

- బంధించిన అటవీశాఖ అధికారులు





కోసిగి: మండల కేంద్రమైన కోసిగిలో ఆదివారం చిరుత పులి కలకలం రేపింది. స్థానిక బసవన్న కొండ దిగువ భాగంలోని ఎర్రవంకలో నడుచుకుంటూ వెళుతూ రైతులకు కనిపించింది. ఎర్రవాగులో ఎటూ కదలకుండా మత్తులో ఉండగా గుర్తించి ఎస్ఐ హనుమంతురెడ్డి సమాచారం అందించారు. చిరుతపులికి హాని కల్గించకుండా పోలీసులతో భద్రత ఏర్పాటు చేశారు. జిల్లా ఫారెస్టు ఆఫీసర్ శ్యామల, స్క్వాడ్ డీఎఫ్ఓ రవి శంకర్, ఆదోని ఫారెస్టు రెంజ్ ఆఫీసర్ తేజస్వీ అక్కడి చేరుకుని రైతుల సహాయంతో చిరుతపులిని బోనులో బంధించారు. దానిని మత్తులోనుంచి బయటపడేందుకు నీళ్లను పోసి వాహనంలో తరలించారు. కొండ ప్రాంత నుంచి నీళ్ల తాగేందుకు చిరుతపులి కిందకు వచ్చిందని, మత్తులో ఉండడానికి కారణాలు వైద్య పరీక్ష అనంతరం తెలుస్తుందని డీఎఫ్ఓ తెలిపారు.

నేటి నుంచి వర్సిటీల్లో పీజీ తరగతులు

కర్నూలు కల్చరల్: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని రాయలసీమ యూనివర్సిటీ, క్లస్టర్ యూనివర్సిటీ, డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలు సోమవారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. గత నెల 15 నుంచి వర్సిటీలకు వేసవి సెలవులు ప్రకటించారు. సెలవుల అనంతరం పోస్ట్ గ్రాడ్యుయేషన్ తరగతులు మొదలు కానున్నాయి. మళ్లీ వర్సిటీల్లో విద్యార్థుల సందడి కనిపించనుంది.

పల్లె ఖజానా ఖాళీ

- నేటికీ విడుదల కాని 15వ ఆర్థిక సంఘం నిధులు
- స్థానిక సంస్థల్లో మెజారిటీ వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులే
- అందుకే కూటమి సర్కార్ కక్ష కట్టిందనే విమర్శలు
- గత ఏడాది నవంబర్‌లో విడుదలైన మొదటి విడత నిధులు
- ఈ ఏడాది మార్చిలోపే విడుదల కావాల్సిన 2వ విడత నిధుల్లో తీవ్ర జాప్యం
- చిన్న చిన్న పనులను కూడా చేపట్టలేని స్థితిలో మైనర్ పంచాయతీలు

కర్నూలు(అర్బన్): స్థానిక సంస్థలకు విడుదల కావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో గ్రామ పంచాయతీల్లో ఖజానాలు ఖాళీగా ఉన్నాయి. స్థానిక సంస్థలకు ఆయువుపట్టుగా ఉన్న ఆర్థిక సంఘం నిధుల విడుదలలో తీవ్ర జాప్యం నెలకొన్న కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో చిన్న చిన్న పనులను కూడా చేపట్టలేని దుస్థితి నెలకొనింది. ప్రతి ఏడాది రెగ్యులర్‌గా రెండు విడతల్లో విడుదల కావాల్సిన ఈ నిధులకు 'చంద్ర' గ్రహణం పట్టుకుంది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గత ఏడాది నవంబర్ నెలలో మొదటి విడత నిధులు గ్రామ పంచాయతీలు, మండల పరిషత్, జిల్లా పరిషత్‌కు రూ.60,03,95,063 విడుదలయ్యాయి. ఈ నేపథ్యంలోనే 2వ విడత నిధులు ఈ ఏడాది మార్చిలోగా జిల్లాలోని స్థానిక సంస్థలకు దాదాపు ఇంతే మొత్తం విడుదల కావాల్సి ఉంది. అయితే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులపై శ్రద్ధ చూపకపోవడంతో 2025–26 ఆర్థిక సంవత్సరం వచ్చినా, నేటికి నిధులు విడుదల కాకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. మేజర్ గ్రామ పంచాయతీలకు పలు రకాల ఆదాయ వనరులు ఉన్న కారణంగా ఏదో ఒక విధంగా నెట్టుకొచ్చినా, ఎలాంటి ఆదాయ వనరులు లేని మైనర్ గ్రామ పంచాయతీలు ప్రభుత్వాల నుంచి విడుదలయ్యే గ్రాంట్లపైనే ఆధారపడాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలోనే 15వ ఆర్థిక సంఘం 2వ విడత నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో ఆయా మైనర్ గ్రామ పంచాయతీల్లో కనీసం వీధి బల్బులు, బ్లీచింగ్ పౌడర్ కూడా కొనుగోలు చేయలేని దుస్థితిలో ఉన్నాయి.

సింహభాగం వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులే

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని స్థానిక సంస్థల్లో సింహభాగం వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రజా ప్రతినిధులే ఉన్న కారణంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడితే వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులకు మంచి పేరు వస్తుందనే కక్షతో కూటమి ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధుల విడుదలకు మోకాలడ్డుతోందనే విమర్శలు కూడా బలంగా వినిపిస్తున్నాయి. గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా తమ పాలన ఉంటుందని గ్రామీణాభివృద్ధి శాఖను ఏరికోరి తీసుకున్న డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కూడా గ్రామాల అభివృద్ధి గురించి మాట్లాడకపోవడం శోచనీయమనే భావన సర్వత్రా వ్యక్తమవుతోంది.

ఎంతమంది వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు ఉన్నారంటే (ఉమ్మడి జిల్లా) ...

స్థానిక సంస్థలు	మొత్తం	పార్టీ
జెడ్పీటీసీలు	53	వైఎస్సార్‌సీపీ (53)
ఎంపీటీసీలు	796	వైఎస్సార్‌సీపీ (672)
సర్పంచులు	970	వైఎస్సార్‌సీపీ మద్దతు దారులు (754)



ఆలూరులోని గ్రామ సచివాలయం

చిన్న, చిన్న పనులను కూడా చేపట్టలేని దుస్థితి

15వ ఆర్థిక సంఘం నిధుల్లో భాగంగా టైడ్, బేసిక్ గ్రాంట్ల రూపంలో నిధులు స్థానిక సంస్థలకు విడుదలవుతాయి. టైడ్ కింద విడుదలైన నిధుల్లో 50 శాతం నిధులను తాగునీటి అవసరాలకు, మిగిలిన 50 శాతం నిధులను పారిశుద్ధ్యానికి వెచ్చించాల్సి ఉంది. అలాగే బేసిక్ గ్రాంట్ కింద విడుదలైన నిధులను గ్రామంలో అవసరమైన ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైన్లు, ఇతరత్రా మరమ్మతులకు వినియోగించుకునే సౌలభ్యం ఉంది. అయితే ఈ గ్రాంట్లు గత ఆరు నెలలుగా విడుదల కాకపోవడంతో మైనర్ పంచాయతీల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేని పరిస్థితి నెలకొనింది.

గత ఏడాది విడుదలైన నిధులే

2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గత ఏడాది నవంబర్‌లో విడుదలైన నిధులే తప్ప, నేటి వరకు స్థానిక సంస్థలకు ఎలాంటి నిధులు ఇప్పటి వరకు విడుదల కాలేదు.

ఎంతెంత విడుదలయ్యాయంటే ...

(ఉమ్మడి కర్నూలు జిల్లా)

జిల్లా పరిషత్‌కు బేసిక్ గ్రాంట్ కింద రూ.5,33,72,556.
టైడ్ కింద రూ.8,00,59,140

మండల పరిషత్తులకు బేసిక్ కింద రూ.5,42,88,238.
టైడ్ కింద రూ.8,14,32,379

(నంద్యాల జిల్లా)

గ్రామ పంచాయతీలకు బేసిక్ కింద రూ.10,45,69,811
టైడ్ కింద రూ.14,32,89,852

శోచనీయం



గ్రామాల అభివృద్ధిని కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన 2వ విడత 15వ ఆర్థిక సంఘం నిధులు నేటికీ విడుదల కాకపోవడం దారుణం. మండల పరిషత్తుకు విడుదలయ్యే ఈ నిధులతో పలు అభివృద్ధి పనులు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. నేటికీ ఎంపీపీ, ఎంపీటీసీలకు కూడా గౌరవ వేతనాలు కూడా విడుదల చేయకపోవడం శోచనీయం.

– నారాయణదాస్, ఎంపీపీ, పత్తికొండ

సొంత నిధులు వెచ్చిస్తున్నాం



పాలక ప్రభుత్వాలు 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయడంలో తీవ్ర జాప్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. దీంతో ప్రజలకు మౌలిక వసతులను కల్పించేందుకు అవసరమైన పనులకు సొంత నిధులను వెచ్చిస్తున్నాం. గత ఏడాది నవంబర్‌లో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదటి విడత నిధులు విడుదల చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి నిధులు విడుదల కాకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటు పడుతోంది.

– ఉప్పరి నాగేంద్ర, సర్పంచ్, జోళదరాశి, కోవెలకుంట్ల మండలం

పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులే ఆధారం



గ్రామ పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులే ఆధారం. సకాలంలో ఈ నిధులు విడుదలైతే గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది. ఎలాంటి ఇతరత్రా ఆదాయ వనరులు లేని గ్రామ పంచాయతీల్లో ప్రస్తుత వర్షాకాలంలో వీధుల్లోని రోడ్లపై బ్లీచింగ్ పౌడర్ చల్లేందుకు కూడా వీలు లేని పరిస్థితులు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం 2వ విడత నిధులు విడుదలయ్యేలా చర్యలు చేపట్టాల్సి ఉంది.

– బీ మద్దిలేటి, సర్పంచ్, నల్కాపురం, కల్లూరు మండలం

వృద్ధుల్లో మానసిక ధైర్యం నింపాలి



వృద్ధులతో మాట్లాడుతున్న జడ్జి అమ్మన్న రాజ

నంద్యాల(వ్యవసాయం): సమాజంలోని వృద్ధుల పట్ల ప్రేమ, గౌరవం, ఆదరణ చూపి వారిలో మానసిక ధైర్యాన్ని నింపాల్సిన బాధ్యత అందరిపై ఉందని మండల లీగల్ సెల్ చైర్మన్, 3వ అదనపు జిల్లా జడ్జి అమ్మన్న రాజ అన్నారు. ఆదివారం ప్రపంచ వృద్ధుల దుర్వినియోగ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని రైతునగర్‌లోని ప్రతిభ వృద్ధుల అనాథ ఆశ్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వృద్ధాశ్రమంలోని వృద్ధుల ఆరోగ్య తదితర విషయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ వృద్ధులను శారీరక, మానసిక వేధింపులు కల్పించవద్దన్నారు. వారి వద్ద ఆస్తి, డబ్బు అపహరణ కాకుండా కాపాడుకునేందుకు చట్టాలు ఉన్నాయన్నారు. వారి అవసరాలను తీర్చడంలో నిర్లక్ష్యం చేయకూడదన్నారు. ఏవైనా సమస్యలుంటే మండల్ లీగల్ సెల్ ద్వారా ఉచిత న్యాయాన్ని అందజేస్తామని వృద్ధులకు సూచించారు. ఆయన వెంట మండల లీగల్ సెల్ న్యాయవాది గౌండ్ల మద్దిలేటి, వృద్ధాశ్రమ నిర్వాహకులు నారాయణ, వార్డెన్ లక్ష్మీదేవి, లోక్ అదాలత్ సిబ్బంది రామచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

మద్దతు ధర.. అరకొరే!

- 14 రకాల పంటలకు మద్దతు ధర ప్రకటించిన కేంద్రం
- స్వల్ప పెంపుతోనే సరిపెట్టిన వైనం
- మద్దతు ధర పెంపు కంటితుడుపు చర్యే
- తడిసి మోపెడవుతున్న సాగు ఖర్చులు
- అన్నదాతను ఆదుకోని కూటమి ప్రభుత్వం
- ఆందోళన చెందుతున్న రైతులు



సంజామల మండలం ఆల్వకొండ సమీపంలో సాగైన పత్తి

కోవెలకుంట్ల: ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల మద్దతు ధర ప్రకటించింది. పెరిగిన విత్తనాలు, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, సేద్యాలు, కలుపు నివారణ, ఇతర వ్యవసాయ ఖర్చుల కనుగుణంగా మద్దతు ధర లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వివిధ పంటల సాగు, పంట దిగుబడులకు, మద్దతు ధరకు ఏమాత్రం పొంతన లేకపోవడం అన్నదాతను నిరాశ పరుస్తోంది. ఆయా పంటలకు ప్రతి ఏటా మద్దతు ధర నామమాత్రంగా పెంచుతున్నారే తప్ప క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణలోకి తీసుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. జిల్లాలోని 29 మండలాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 2.37 లక్షల హెక్టార్లలో రైతులు వరి, మొక్కజొన్న, మినుము, మిరప, జొన్న, పెసర, వేరుశనగ, పత్తి, ఆముదం, కంది, పొద్దుతిరుగుడు, ఉల్లి, సోయాచిక్కుడు, తదితర పంటలు సాగు చేయాల్సి ఉంది. 2025–26 ఖరీఫ్ సీజన్‌లోని 14 రకాల పంటలకు ఇటీవల కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. ఆయా పంటలకు ప్రకటించిన మద్దతు ధర ఆశాజనకంగా లేదని రైతులు పెదవి విరుస్తున్నారు.

ఐదేళ్లలో వరికి పెరిగిందే కొంతే!

జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో సాగయ్యే వరి పంటకు మద్దతు ధర పెంచడంలో పెద్దగా తేడా లేకపోవడతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 2018–19 సాధారణ రకం వరికి క్వింటా ధర రూ. 1,750 ఉండగా ఏ-గ్రేడ్ రకానికి 1,777 ఉండగా, ప్రస్తుతం 2025–26 గాను సాధారణ రకానికి రూ. 2,369 ఏ-గ్రేడ్ రకానికి రూ. 2,389 నిర్ణయించారు. గతేడాది కంటే ఈ ఏడాది కేవలం రూ. 69 మాత్రమే పెరిగింది.

గతేడాదితో పోల్చితే ఈ ఏడాది పెరిగిన పంట మద్దతు (క్వింటం) ధర వివరాలు

పంటరకం	పెరిగిన ధర (రూ..)
వరి సాధారణ	69
వరి ఏగ్రేడ్	69
జొన్న హైబ్రీడ్	328
జొన్న మాల్దాండి	328
సజ్జలు	150
మొక్కజొన్న	175
కందులు	450
పత్తి	589

ఏటా పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులు

వ్యవసాయ రంగంలో ఏటా పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఏటా సాగు ఖర్చులు ఎకరాకు రూ. 8 వేల నుంచి రూ. 10 వేల వరకు పెరుగుతున్నాయి. పెరిగిన ధరలకనుగుణంగా మద్దతు ధర పెంచకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్త చేస్తున్నారు. డీజిల్ ధరలు పెరగడంతో ట్రాక్టర్ యజమానులు సేద్యం ధరలను పెంచారు. కూలీలు, రసాయన ఎరువులు, పురుగు నివారణ మందులు, తదితర ఖర్చులు భారీగా పెరిగాయి. వరి సాధారణ రకం క్వింటా రూ. 2,300 ఉండగా ఈ ఏడాది రూ. 2,369కి పెంచారు. అలాగే గ్రేడ్ ఏ రకం 2,320 ఉండగా ,2389, జొన్న హైబ్రిడ్ రూ. 3371 ఉండగా రూ. 3699, మాల్దండి రకం రూ. 3421 ఉండగా 3,749, సజ్జ రూ. 2,525 ఉండగా రూ. 2,775, రాగులు 4,290 ఉండగా రూ. 4866కి పెరిగింది. మద్దతు ధర అంతంత మాత్రంగా ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

క్లుప్తంగా

అమ్మవారికి పల్లకీ సేవ



పల్లకీలో స్వామిఅమ్మవార్లు

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులు ఆశీనులుగావించి వేదమంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో దేవస్థాన అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

వృద్ధురాలి నేత్రాలు దానం



వృద్ధురాలి నేత్రాలు దానం చేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: పట్టణానికి చెందిన లక్ష్మీదేవి అనే వృద్ధురాలు (75) అనారోగ్యంతో మృతి చెందగా ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేసి ఆదర్శంగా నిలిచారు. వృద్ధురాలి కుమారుడు వీరేష్, మనవడు లింగేష్ వెంటనే లైఫ్ యువనేత్ర సేవా సమితికి విషయం చెప్పడంతో వారు కర్నూలు ఐ బ్యాంకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు ప్రభుత్వ ఆసుపత్రి టెక్నీషియన్ శ్రీకాంత్ వృద్ధురాలి నేత్రాలను సేకరించి కుటుంబ సభ్యుల చేతుల మీదుగా తీసుకున్నారు.

ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ మృతి

బేతంచెర్ల: ఫిట్స్‌తో ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ పుల్లారెడ్డి (58) మృతి చెందాడు. ఈ దుర్ఘటన ఆదివారం ఆర్ బుక్కాపురం గ్రామ సమీపాన చోటు చేసుకుంది. కొమ్మూరు కొట్టాల గ్రామానికి చెందిన పుల్లారెడ్డి ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. మండలంలోని ఆర్ బుక్కాపురం గ్రామం వద్ద జరుగుతున్న సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు ట్రాక్టర్ తీసుకెళ్లాడు. పనులను ముగించుకొని ట్రాక్టర్ తోలుతుండగా ఇంటికి బయలు దేరాడు. ఫిట్స్ రావడంతో ట్రాక్టర్ కింద పడి టైర్ ఎక్కడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

20 నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

ఆదోని సెంట్రల్: డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 20వ తేదీ నుంచి కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని ఆదోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్.సుధాకర్‌రెడ్డి ఆదివారం విలేకరులకు తెలిపారు. పాలిసెట్ 2025 ఎగ్జామ్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు కౌన్సెలింగ్‌కు సంబంధించిన ఫీజును ఈనెల 20 నుంచి 27వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో చెల్లించాలన్నారు. ఈనెల 21 నుంచి 28వ తేదీ వరకు పాలిసెట్ ర్యాంకు ప్రకారం ఆదోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. వివరాలకు 9885251182, 8121555646 నంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు ఆత్మకూరులో జాబ్‌మేళా

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.జి. శ్రీనివాస్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేళాకు 10 ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు వస్తున్నారని, పది ఆ పై విద్యార్హత కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 7673902328, 9154830286 నంబర్లను సంప్రదించాలన్నారు.

చిన్న కుటుంబానికి జైకొడుతున్నారు!

- కుటుంబ నియంత్రణ పాటిస్తున్న జంటలు
- అధిక సంతానం భారంగా భావిస్తున్న యువత
- పిల్లల చదువు, ఉద్యోగం, పెళ్లిళ్లు బాధ్యతలు భారమవుతున్న వైనం
- ఒకరు, ఇద్దరు సంతానానికే పరిమితం
- ఏటా పెరుగుతున్న కు.ని ఆపరేషన్లు

అధిక సంతానం అన్ని రకాలుగా అనర్థమని, ఒకరిద్దరిని మాత్రమే కనాలని కొన్ని దశాబ్దాల క్రితం అప్పటి ప్రభుత్వాలు దండోరా వేయించేవి. దీనిపై ఎక్కువ ప్రచారం చేయడంతో పాటు అధిక సంతానం వల్ల కలిగే ఇబ్బందులను ప్రజలు గుర్తించారు. ఈ మేరకు కుటుంబ నియంత్రణ వైపు మొగ్గు చూపారు. ఈ నేపథ్యంలో ప్రతి సంవత్సరం ప్రభుత్వం లక్ష్యాలు నిర్దేశించి మరీ కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు నిర్వహించింది. కానీ ఇప్పుడు ప్రభుత్వం ఎంత ఎక్కువైనా పిల్లలను కనాలని చెబుతోంది. వారి బాధ్యత మేము చూసుకుంటామని ప్రచారం చేస్తోంది. కానీ ప్రభుత్వం మాట ఎవ్వరూ లెక్కచేయడం లేదు. అధిక సంతానం వల్ల కలిగే ఇబ్బందుల గురించి మాకు తెలుసంటూ కు.ని వైపు మొగ్గుచూపుతున్నారు.

కర్నూలు(హాస్పిటల్): చిన్న కుటుంబం...చింతలేని కుటుంబమని ఆధునిక జంటలు భావిస్తున్నాయి. అందులో భాగంగానే అధిక శాతం ఇద్దరు పిల్లలకే కు.ని ఆపరేషన్లు చేయించుకుంటూ ఉండగా మరి కొందరైతే ఒకరే చాలని సరిపెట్టేసుకుంటున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రస్తుత అంచనా ప్రకారం 44 లక్షలకు పైగా జనాభా ఉంది. 2001లో 40 లక్షలు ఉన్న జనాభా 2011 జనాభా లెక్కల నాటికి 44లక్షలకు చేరుకుంది. ఇప్పటికి మరో ఆరు లక్షలకు దాటి జిల్లా జనాభా 50 లక్షలకు చేరినట్లు అంచనా. ఒకప్పుడు పెరుగుతున్న జనాభాను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను ప్రోత్సహించాయి. కొన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి నగదుతో పాటు బహుమతులు కూడా పంచిపెట్టాయి. ట్యూబెక్టమి ఆపరేషన్ అయితే కోత, కుట్లు ఉంటుందని, కొన్ని రోజులు విశ్రాంతి తీసుకోవాల్సి వస్తుందని భావించి పెద్దగా కోత, కుట్లు లేని, త్వరగా కోలుకునే అవకాశం ఉన్న డీపీఎల్ ఆపరేషన్లను ప్రారంభించారు. ఈ మేరకు వైద్య సిబ్బందికి అవగాహన కల్పించి వారి ద్వారా బాలింతలను ఆసుపత్రికి తీసుకొచ్చి మరీ డీపీఎల్ ఆపరేషన్లు చేయించారు. ప్రస్తుతం కర్నూలు, నంద్యాల, ఆదోని ప్రభుత్వ ఆసుపత్రుల్లోని పీపీ యూనిట్లతో పాటు ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆలూరు, బేతంచర్ల, డోన్, నందికొట్కూరు, గూడూరు, గార్గేయపురం, డోన్‌తో పాటు కర్నూలులోని గడియారం ఆసుపత్రిలలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తున్నారు.

సీఎం చెప్పినా వినేది లేదు..

రాష్ట్ర విభజన తర్వాత జనాభా తగ్గిందని, ప్రజలు సంతానాన్ని పెంచాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2014లోనే ప్రకటించారు. ఈ మేరకు 2014వ సంవత్సరం వరకు ఏడాదికి 34వేల వరకు ఉన్న కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల లక్ష్యంను ఎత్తేశారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు సంబంధించి ప్రజలపై ఒత్తిడి తేవొద్దని, లక్ష్యాలు ఏమీ వద్దని అప్పట్లో ఆయన పేర్కొన్నారు. ఇప్పుడు కూడా ఆయన పాత విధానాన్నే అవలంభిస్తూ ప్రజలు జనాభాను పెంచాల్సిన అవసరం ఉందని, ఎంత మందిని వీలైతే అంత మందిని కనాలని, వారి బాగోగులు చూసుకునే బాధ్యత నాదని చెబుతున్నారు. కానీ ఆయన మాటలను ఎవ్వరూ విశ్వసించడం లేదు. ఇద్దరు పిల్లలు కాగానే అధిక శాతం కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ మేరకు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో రెండో కాన్పు సమయంలో సిజేరియన్ అయితే ఒకేసారి కు.ని ఆపరేషన్ కూడా చేయిస్తున్నారు.

మేము సైతం అంటున్న మగాళ్లు..

కుటుంబ నియంత్రణ ఆపరేషన్ అంటే అది కేవలం మహిళలు మాత్రమే చేయించుకుంటారన్న ధోరణిలో మగవారు ఉండేవారు. ఈ మేరకు 2011 నుంచి 2019 వరకు జిల్లాలో ఒక్క పురుషుడు కూడా కుటుంబ నియంత్రణ ఆపరేషన్(వేసక్టమి) చేయించుకోలేదు. ఆ తర్వాత 2020 నుంచి ప్రతి సంవత్సరం ఒక్కొక్క మగాడు ఆపరేషన్ చేయించుకుంటూ వస్తున్నారు. 2023-24లో ఈ సంఖ్య మూడుకు చేరగా గత ఏడాది ఏకంగా పది మంది మగవారు కు.నిలో భాగంగా వేసక్టమి ఆపరేషన్ చేయించుకున్నారు. పెద్దగా కోత, కుట్లు లేకపోయినా, రక్తస్రావం రాకపోవడం, ఆపరేషన్ తర్వాత కూడా సంసార జీవితానికి ఎలాంటి ధోకా లేకపోవడం, ఈ అంశాలపై వైద్యులు, సిబ్బంది అవగాహన కల్పించడంతో ఆపరేషన్ చేయించుకునే మగవారి సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది.

జిల్లాలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు

సంవత్సరం	ట్యూబెక్టమి	వేసక్టమి
(ఉమ్మడి జిల్లా)		
2019-20	16,556	0
2020-21	7,728	1
(కర్నూలు జిల్లా)		
2021-22	7,575	1
2022-23	6,989	1
2023-24	8,836	3
2025-26	9,824	10





జీజీహెచ్‌లోని కుటుంబ నియంత్రణ ఓపీ విభాగం

కుటుంబ నియంత్రణకు స్వచ్ఛందంగా ముందుకు



క్షేత్రస్థాయిలోని పీహెచ్‌సీ, విలేజ్ హెల్త్ క్లినిక్స్ లెవెల్స్‌లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ముఖ్యంగా తాత్కాలిక పద్ధతులైన ఐయుసీడీ, అంత్రో ఇంజెక్షన్లు, ఎమర్జెన్సీ పిల్స్, మగవారికి నిరోధ్‌లపై వైద్య సిబ్బంది ఎక్కువగా చెబుతున్నారు. దీనివల్ల కాన్పుకు, కాన్పుకు మధ్య ఎడమ కనీసం రెండు, మూడేళ్లు వస్తుంది. టీనేజిలో గర్భం దాల్చకుండా కూడా ఈ విధానాలు ఉపయోగపడతాయి. దీనివల్ల మాతృమరణాలు జరగకుండా ఉంటాయి. తల్లీబిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటారు. అధిక శాతం ప్రజలు రెండు కాన్పుల తర్వాత ట్యూబెక్టమి, డీపీఎల్ వేసక్టమి విధానంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకోవడానికి స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు.

–డాక్టర్ పి.శాంతికళ, డీఎంహెచ్‌వో, కర్నూలు

పిల్లలను పెంచాలంటే భారమని..!

ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు ఎక్కువగా ఉండేవి. తల్లిదండ్రులతో పాటు అన్నదమ్ములు అందరూ ఒకే ఇంట్లో ఉండేవారు. మగవారు ఉద్యోగాలు, వ్యాపారాలు, పనులకు వెళితే ఇంట్లో ఉన్న ఆడవారిలో ఎవరో ఒకరు పిల్లల ఆలనాపాలనా చూసుకునేవారు. అంతేకాదు ఆదాయ వ్యయాలు కూడా కలిసి పంచుకునేవారు. కష్టమొచ్చినా, నష్టమొచ్చినా కలిసి భరించేవారు. కానీ ఇప్పుడు చిన్నకుటుంబాలు అధికమయ్యాయి. వివాహమైన వెంటనే వేరుకాపురం పెట్టేవారు ఎక్కువయ్యారు. ఈ కండిషన్‌పైనే పెళ్లిళ్లు జరుగుతున్నాయి కూడా. దీంతో పిల్లలు కలిగితే వారిని చూసుకునేవారు కరువయ్యారు. వారిని పెంచి పెద్ద చేయడమే కాదు వారి చదువులు నేటి పరిస్థితుల్లో భారంగా మారాయి. అంతేకాదు పెద్దయ్యాక వారికి వివాహాలు చేయడం తలకుమించిన భారంగా మారడంతో ఇద్దరు లేదా.. ఒక సంతానికే పరిమితమవుతున్నారు.

మంత్రాలయంలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

మంత్రాలయం: శ్రీరాఘవేంద్రస్వామి దర్శనార్థం కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ఆదివారం రాత్రి మంత్రాలయం వచ్చారు. వందేభారత్ రైలులో మంత్రాలయం రోడ్డు (తుంగభద్ర) రైల్వే స్టేషన్‌లో దిగారు. అక్కడ రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి స్వాగతం పలికారు. అక్కడి నుంచి మాధవరం మీదుగా రోడ్డు మార్గంలో మంత్రాలయం చేరుకున్నారు. స్థానికంగా ట్రాన్స్‌కో సీఎండీ సంతోషరావు, జాయింట్ కలెక్టర్ నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ట్రాన్స్ ఎస్ఈ ఉమాపతి, అడిషినల్ ఎస్పీ ఉసేన్‌పీరా పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. ఉదయం ఆయన స్వామిని దర్శించుకోనున్నారు.



కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషితో పాటు ఆహ్వానితులు

బడిలో కురిసిన జ్ఞాపకాల జడివాన



సమావేశమైన సెయింట్ మేరీస్ పాఠశాల పూర్వ విద్యార్థులు

కర్నూలు కల్చరల్: దాదాపు 65 ఏళ్ల తర్వాత వారంతా ఒక చదువులమ్మ ఒడిలో మళ్లీ కలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను పంచుకుంటూ సంబరపడ్డారు. బడిలో అల్లరి.. ఎదురుగా పార్కులో ఆడిన ఆటలు.. అప్పటి గురువులు.. చదువులను గుర్తు చేసుకుంటూ ఆనందంలో మునిగిపోయారు. ఇందుకు కర్నూలు సెయింట్ మేరీస్ పాఠశాల వేదిక అయ్యిం పూర్వ విద్యార్థుల వజ్రోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం పాఠశాల ఆవరణలో జరిగిన వేడుకల్లో మొదటి తరగతిలో చేరి 60 సంవత్సరాలు, 10వ తరగతి పూర్తి చేసి 50 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. సేవే పరమావధిగా భావించే క్యాథెలిక్స్ యాజమాన్యంలోని సెయింట్‌మేరీస్ పాఠశాల గత 86 సంవత్సరాలుగా ఎందరో మేధావులను తయారు చేసిన గొప్ప విద్యా సంస్థగా నిలిచింది. విద్యాబుద్ధులు నేర్పి స్వర్గస్తులైన గురువులు, పరమపదించిన పూర్వ విద్యార్థులకు నివాళి అర్పించారు. విద్యార్థి దశలోని తీపి గుర్తులు, పాఠశాల ఆవరణ, చిల్డ్రన్స్ పార్క్‌లో గడిపిన క్షణాలు గుర్తు చేసుకున్నారు. ఒకరి యోగ క్షేమాలు ఒకరు అడిగి తెలుసుకొని ఆనందంగా గడిపారు. విద్యా సంస్థ నుంచి ఎదిగి ప్రపంచం నలుమూలల పేరు ప్రఖ్యాతులు గడించిన శాస్త్రవేత్తలు, సివిల్ సర్వెంట్లు, డాక్టర్లు, ఇంజినీర్లు, విద్యవేత్తలు, పారిశ్రామిక వేత్తలు వ్యాపార వేత్తలుగా రాణిస్తున్నారని పాఠశాల పూర్వ విద్యార్థి విశ్రాంత ఆచార్యులు మన్సూర్ రహమాన్ అన్నారు. కార్యక్రమంలో ఆడిటర్ స్కంద కుమార్, చర్మవ్యాధి నిపుణులు డాక్టర్ నాగసేన, హైకోర్టు న్యాయవాది రంగారెడ్డి, మాస్ పవర్‌సెక్యూరిటీస్ అధినేత సలీమ్ అహ్మద్, విశ్రాంత బ్యాంక్ మేనేజర్ గోపాలకృష్ణ, ఈశ్వరయ్య (బెంగళూరు ఎంపోరియం), వెంకట రమణ (అజంతా హోటల్), గురు రాజాచారి (ఉడిపి హోటల్), కాంట్రాక్టర్ కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి తరహాలో ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధి

మంత్రాలయం: మంత్రాలయం నియోజకవర్గ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను తిరుపతి తరహాలో రూ.38 లక్షలతో అభివృద్ధి చేస్తున్నట్లు ఆర్టీసీ కడప రీజినల్ చైర్మన్ పి.నాగరాజు తెలిపారు. ఆదివారం ఆయన పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులతో కలిసి ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. ప్రయాణికులతో ముచ్చటించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ఎంపీ నిధులతో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే బస్టాండ్ నుంచి కాకినాడ, తిరుపతి సర్వీసులతోపాటు అమావాస్య, సోమవారాలు ఉరకుంద, పంచముఖి సర్వీసులను ప్రారంభిస్తామన్నారు. మంత్రాలయం రోడ్డు రైల్వే స్టేషన్‌కు మరో సర్వీసు పెంచుతామని చెప్పారు. కడప రీజినల్ వ్యాప్తంగా 250 ఎలక్ట్రికల్ బస్సులు ప్రవేశపెట్టామన్నారు. ఎమ్మిగనూరు బస్టాండ్‌కు నెలకు రూ.3.06 కోట్ల ఆదాయం వస్తోందని, అక్కడ కూడా బస్టాండ్‌లో వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు సైతం బస్టాండ్ ప్రగతికి సహకరిస్తామని హామీ ఇచ్చారన్నారు. బస్టాండ్‌లో పేమెంట్ పార్కింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో ఎమ్మిగనూరు డిపో మేనేజర్ మద్దిలేటి నాయుడు, అసిస్టెంట్ మేనేజర్ యల్లప్ప తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఆర్టీసీ కడప రీజినల్ చైర్మన్

పాఠశాల అభివృద్ధికి కృషి

నందికొట్కూరు: తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని పూర్వ విద్యార్థి, కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా స్పష్టం చేశారు. నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియాతో మాట్లాడి ఆయన పట్టణంలోని సుబ్బారావుపేటలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (కొట్టంబడి)అభివృద్ధి కోసం డిస్ట్రిక్ జనరల్ ఫండ్ నుంచి రూ. 13 లక్షలు విడుదల చేయించారు. ఆ నిధులతో చేపట్టనున్న స్కూల్ మరమ్మతు పనులను ఆదివారం ఎమ్మెల్యే జయసూర్యతో కలిసి కర్నూలు కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. ఈ పాఠశాలలో చదివి ఉన్నతస్థాయికి చేరుకున్న ప్రతి ఒక్కరూ పాఠశాల డెవలప్‌మెంట్ కోసం సహాయ సహకారాలు అందించాలన్నారు. విద్యాబుద్ధులు నేరిస్తున పాఠశాల రుణం తీర్చుకోవాల్సిన బాధ్యత పూర్వ విద్యార్థులపై ఉందన్నారు. ప్రస్తుతం మంజూరైన నిధులతో రూఫ్ సీలింగ్, మినరల్ వాటర్ ప్లాంట్, కాంపౌండ్ వాల్, పెయింటింగ్, శ్లాబ్ మరమ్మతులు తదితర వాటికి ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, కమిషనర్ బేబి, మార్కెట్ యార్డు చైర్మన్ వీరం ప్రసాదరెడ్డి, పీఆర్ ఈఈ రఘురామిరెడ్డి, డీఈలు ధనిబాబు, రామ్మోహన్, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం శర్మ, ఏఈ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు సుమలత, చాంద్‌బాషా, లాలు, జాకీర్, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



కొట్టంబడి మరమ్మతు పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కర్నూలు కలెక్టర్ రంజిత్‌బాషా

ఇండియన్ ఆర్మీలో చేరండి



మాట్లాడుతు కల్నల్ రజిత సువర్ణ

నంద్యాల(న్యూటౌన్): ఆసక్తి గల యువకులు ఇండియన్ ఆర్మీలో చేరాలని గుంటూరు ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీసు డైరెక్టర్ కల్నల్ రజిత సువర్ణ అన్నారు. ఇండియన్ ఆర్మీలో చేరడానికి ఉన్న అవకాశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. నంద్యాల పట్టణంలోని శ్రీరామకృష్ణ డిగ్రీ అటానమస్ కళాశాలలో ఆదివారం 9వ ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ శిక్షణ కార్యక్రమం జరిగింది. డిప్యూటీ క్యాంపు కమాండెంట్ కల్నల్ ప్రియ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి గుంటూరు ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీసు డైరెక్టర్ హాజరై మాట్లాడారు. అగ్నిపథ్ ద్వారా ఇండియన్ ఆర్మీలో చేరేందుకు ఉన్న అవకాశాలను వివరించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కేడెట్స్, ఎన్‌సీసీ ఆఫీసర్లు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్న ఏపీ నాగేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): రెండు నెలల నుంచి 104 ఉద్యోగులకు వేతనాలు చెల్లించడంలేదని, వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని 104 ఉద్యోగుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఏపీ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కర్నూలులోని కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. జీతాలు రాకపోవడంతో ఉద్యోగులు, వారి కుటుంబీకులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారన్నారు. జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దయ్య మాట్లాడుతూ.. గతంలో ప్రతి నెలా ఉద్యోగులకు వేతనాలు ఇచ్చేవారని, ప్రస్తుతం చెల్లించడం లేదన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు,, ఉపాధ్యక్షుడు వెంకటేష్,కల్యాణి, సీనియర్ నాయకులు బొజ్జప్ప పాల్గొన్నారు.


చెట్నెహాళ్లి ఘటనలో 29 మందిపై కేసు

మంత్రాలయం: మండలంలోని చెట్నెహాళ్లి గ్రామంలో శ్మశాన వాటికకు కంచె ఏర్పాటు చేస్తుండగా వివాదం జరగ్గా.. నలుగురు మహిళలతోపాటు 25 మంది పురుషులపై పోలీసులు కేసు నమోదు చేశారు. శ్మశాన వాటికలోని 0.47 సెంట్ల స్థలాన్ని ప్రభుత్వ ఆధీనంలో ఉంచుకునేందుకు శనివారం కంచె ఏర్పాటు చేసే ప్రయత్నం చేశారు. ఇళ్ల వైపు 20 అడుగుల దూరం వదిలి కంచె ఏర్పాటుకు చర్యలు తీసుకోగా కొందరు ఒప్పుకోలేదు. అధికారుల విధులకు ఆటంకం కల్గించారన్న నేపథ్యంలో జేసీ నవ్య సూచన మేరకు వీఆర్వో భీమయ్య మంత్రాలయం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కంచె కోసం పాతిన పిల్లర్లను తొలగించడమే కాకుండా విధులకు ఆటంకం కల్గించారని 29 మందిపై ఫిర్యాదు చేశారు. అందులో నలుగురు మహిళలతోపాటు 25 మంది పురుషులపై కేసు నమోదు అయ్యింది. ఎస్ఐ శివాంజల్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంద్ర ధనస్సు కనువిందు

ఉపరితల ద్రోణి ప్రభావంతో ఆదివారం కోవెలకుంట్లలో భారీ వర్షం కురిసింది. సాయంత్రం వర్షం పడటం ఆగిపోయాక ఆకాశంలో ఇంద్ర ధనస్సు కనువిందు చేసింది. వివిధ రంగులతో కూడిన ఇంద్ర ధనస్సు మేఘావృతమైన ఆకాశంలో కన్పించడంతో చిన్నపిల్లలు ఇళ్లలో నుంచి బయటకు వచ్చి ఆసక్తిగా తిలకించారు. – కోవెలకుంట్ల





గఘన సోయగం

కర్నూలు నగరంలో ఆదివారం రాత్రి ఆకాశం నీలి వర్ణాన్ని అద్దుకుంది. గంటపాటు మేఘాలు అటూ ఇటూ కదులుతూ కనువిందు చేశాయి. వర్షం కురవకపోవడంతో ప్రకృతి ప్రేమికులు సుందర దృశ్యాలను చూసి ఆనంద పరవశులయ్యారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు